గ్యాస్ ధర దించాల్సిందే..

- పెంచిన గ్యాస్ ధరలతో సామాన్యులపై వంటింటి భారం
- సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం : అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచి సామాన్యుల వంటింటి ఖర్చును మరింత పెంచిందని సీపీఎంజిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోడ సామె ల్ ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధర లను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని దేశవ్యాప్త పిలుపులో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేసి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు తగ్గుతుంటే భారతదేశంలో బీజేపీ మోదీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపేలా గ్యాస్ ధరలు పెంచ డం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్‌పై 50 రూపాయలు పెంచడంతో ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉచిత సన్నబియ్యం అంటూనే మరోపక్క ఇలా గ్యాస్ ధరలు పెంచి ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే గ్యాస్ ధరలు తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా నాయకులు జంగయ్య, జగన్, ఎల్లేశ్, వెంకటేశ్, ముసలయ్య, ఆనంద్, లింగస్వామి, నర్సింహ, జంగయ్య, ప్రభుదాస్, శంకర్, వీరేశ్, స్వామి, దాసు, యాదగిరి, భిక్షపతి, బాలు రాజు, మమేశ్, తరంగ్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

బొంరాస్‌పేట : కేంద్రప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలంటూ దుద్యాల్ మండల కేంద్రంలో సీపీఎం పార్టీ నాయకుడు బుస్స చంద్రయ్య ఆధ్యర్యంలో సిలిండర్ పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్‌పై 50 రూపాయలు పెంచడం చాలా బాధాకరమన్నారు. వెంటనే ధరల పెంపును ఉపసంహరించుకోవాలని అయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, వెంకటయ్య, రాములమ్మ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్‌లో..

తుర్కయాంజాల్ : పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని తుర్కయాంజల్ చౌరస్తాలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను తగ్గించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, తుర్కయాంజాల్ మున్సిపల్ కార్యదర్శి కిషన్, మున్సిపల్ కమిటీ సభ్యులు సత్యనారాయణ, భాస్కర్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

కడ్తాల్ : వంట గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని తలకొండపల్లి మండల కేంద్రంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వంట గ్యాస్ ధరతోపాటు, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌రావు, చెన్నయ్య, పెంటయ్య, బాలు, నర్సింహ, చెన్నయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో..

వికారాబాద్ : గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పట్టణంలోని ఎన్టీర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు సతీశ్, నవీన్, నాయకులు శ్రీనివాస్, యాదయ్య, జంగయ్య, రాములు, వెంకటయ్య, గోపాల్, అలివేలు, ఆంజిలయ్య, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 9 : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో చేవెళ్లలో ఖాళీ సిలిండర్‌తో నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్ ధర పెంపు పేదవాడి నడ్డి విరుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్, జంగయ్య, బీకేయూఎం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఎన్ఎఫ్ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, నాయకులు శివ, లలిత, సుగుణమ్మ, పెంటయ్య, శ్రీకాంత్, యాదగిరి, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

రావినారాయణరెడ్డి కాలనీ చౌరస్తాలో..

పెద్దఅంబర్‌పేట : కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ధరలు తగ్గించేవరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అజ్మీరా హరిసింగ్‌నాయక్, కేతరాజు నర్సింహ, దాసరి ప్రసాద్, దూపం నిరంజన్, పొన్నాల యాదగిరి, రాములు, గోపి, వినోద్‌నాయక్, రవి, మల్లేశ్, రాజు, రమేశ్‌నాయక్, నవనీత, చందన, సుజాత, దేవమ్మ, అనసూయ, ప్రియ, అన్నపూర్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : రావినారాయణరెడ్డి చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ, వివిధ సంఘాల నాయకులు

కొందుర్గులో..

కొందుర్గు : ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ నేతలు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి, సీపీఐ చౌదరిగూడ మండల కార్యదర్శి వెంకటేశ్, కృష్ణ, షబ్బీర్, లింగం, జంగయ్య, శాంతమ్మ, కమలమ్మ, రాములు, అంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత సమాజం వైపు అడుగులు వేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ డీబీ శీతల్

వికారాబాద్, ఏప్రిల్ 9 : నేర రహిత సమాజం వైపు అడుగులు వేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ డీబీ శీతల్ తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మీబాయి పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శీతల్ మాట్లాడుతూ.. నేర రహిత సమాజం వైపు అడుగులు వేసేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే కార్యక్రమాలు దోహద పడుతాయని ఆకాంక్షించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలను వివరించారు. విద్యార్థులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో బాధ్యతాయుతమైన వ్యక్తులుగా మెలగాలని ఆకాంక్షించారు. పోలీసులకు ఎలా దరఖాస్తు చేయాలి, వ్యక్తిగత నిర్వహణ తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. వెంకటేశ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి రాము, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ముఖ్యం

బస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న బీడీ, డాగ్ స్క్వాడ్ అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 9 : శాంతి భద్రతల పరిరక్షణే ముఖ్యమని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని బీడీ టీం, డాగ్ స్క్వాడ్ అధికారులు బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల నేపథ్యంలో అనుమానస్పద వ్యక్తులు, వస్తువులను గుర్తించేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తనిఖీల సమయంలో అధికారులు ప్రజలతో మమేకమై, చట్టబద్ధంగా, మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించినా, శాంతి భద్రతల విషయంలో సందేహాలు ఉన్నా, వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



మిషన్ భగీరథ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొడంగల్, ఏప్రిల్ 9 : మిషన్ భగీరథ పథకంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని, చాలీ చాలని జీతాలతో ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణ శివారులోని సిద్ధినాంపులో ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద కార్మికులు మిషన్ భగరథ కార్యాలయ సిబ్బంది సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకం ఏర్పడిన నాటి నుంచి విధులు నిర్వహిస్తున్నామని, సంబంధిత కాంట్రాక్టర్ ప్రస్తుతం రూ.9 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. ఇతర ప్రదేశాల్లోని పనులు నిర్వహిస్తున్న కార్మికులకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. కొడంగల్ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే అమలు చేయని పక్షంలో వచ్చే శుక్రవారం నుంచి 220 మంది కార్మికులతో సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ పథకం కార్మికులు పాల్గొన్నారు.

ఫార్మా భూముల ఫెన్సింగ్ పనులు నిలిపివేయాలి

సీఐకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

యాచారం, ఏప్రిల్ 9 : ఫార్మా భూముల ఫెన్సింగ్ పనులను వెంటనే ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజుకు సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా భూ నిర్వాసితులకు ప్లాట్లు ఇచ్చేంత వరకు ఫార్మా భూములకు వేస్తున్న ఫెన్సింగ్ పనులను నిలిపివేయాలని పేర్కొన్నారు. నిర్వాసితులకు ప్లాట్లు ఇచ్చిన తర్వాతే భూములను సర్వే చేసి, హద్దులు వేసి, ఫెన్సింగ్ పనులను చేసుకోవాలని ఆయన తెలిపారు. రైతులకు ప్లాట్లు ఇవ్వకుండా పోలీసుల బందోబస్తుతో భూములకు ఫెన్సింగ్ వేసి ఎలా స్వాధీనం చేసుకుంటారని ఆయన ప్రశ్నించారు. పనులను వెంటనే ఆపాలని, లేనిపక్షంలో పనులను అడ్డుకోవడంతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూషణ్, పెద్దయ్య, జంగయ్య, కుమార్, యాదయ్య, లాజర్, యాదగిరి, రాములు, గౌస్, శ్రీకాంత్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారాన్ని కాపాడాలి

ఆయిల్ ఫాం సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొందుర్గు, ఏప్రిల్ 9 : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసి భూసారాన్ని కాపాడాలని ఉద్యానవన శాఖ జిల్లా అధికారిణి హిమబిందు అన్నారు. బుధవారం కొందుర్గు రైతు వేదికలో ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాల్యూ ఆయిల్ ఆండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సహకారంతో రైతులకు చైతన్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా రైతులు మరింత చైతన్యం అవుతారన్నారు. అలాగే ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ కంపనీ డీజీఎం రాంమోహన్‌రావు, ఏవో సురేశ్‌రెడ్డి, హార్టికల్చర్ కొందుర్గు ఫీల్డ్ ఆఫీసర్ రాకేశ్, ఏఈవోలు వాసవి, రమణ, నిఖిల్ పాల్గొన్నారు.

బర్త్‌డే ముసుగులో ముజ్రా

- ఎతుబార్‌పల్లి శివారులో పార్టీ నిర్వహణ
- మద్యం.. గంజాయి మత్తులో అశ్లీల నృత్యాలు
- పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులు
- 70 గ్రాముల గంజాయి, 19 వేల నగదు, ఆరు వాహనాలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, సెల్ ఫోన్లు, గంజాయి

మొయినాబాద్, ఏప్రిల్ 9 : ఓ అసభ్యకర పార్టీ ఘటన వెలుగులోకి వచ్చింది. ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారని, గంజాయి మత్తు ఎక్కించి అర్ధనగ్న నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ ఘటన మొయినాబాద్ మండల పరిధిలోని ఎతుబార్‌పల్లి రెవెన్యూ పరిధిలో కలకలం రేపింది. సీఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నగరంలోని బోరబండకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మహ్మద్ లుఖ్మాన్ తన బర్త్‌డే వేడుకలను ఎతుబార్‌పల్లి శివారులో ఉన్న హాటీడే హోమ్ ఫామ్ హౌజ్‌లో జరుపుకోవడానికి మంగళవారం సాయంత్రం ఏర్పాట్లు చేసుకున్నారు. బర్త్‌డే పార్టీ ముసుగులో ముజ్రా పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ పార్టీలో పశ్చిమ బెంగాల్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ఆరు గురు యువతులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి మహ్మద్ లుఖ్మాన్‌తో పాటు 12మంది స్నేహితులు హాజరయ్యారు. ముజ్రా పార్టీకి ఆరు గురు యువతులను డి.బాబు, రీనా తీసుకొచ్చారు. యువతీ, యువకులకు మద్యం, గంజాయి మత్తెక్కించి అర్ధనగ్నంగా అశ్లీల నృత్యాలు చేయించారు. అసాంఘిక కార్యకలాపాలు సైతం నిర్వహించారు. ఈ విషయమై రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్థానిక పోలీసులతో కలిసి రాత్రి 11.30 గంటలకు ముజ్రా పార్టీ శిబిరంలో దాడులు నిర్వహించి పార్టీని భగ్నం చేశారు. పోలీసులు వెళ్లిన సమయంలో కూడా అశ్లీల నృత్యాలు చేస్తున్నారు. పూర్తి వివరాలు సేకరించి బుధవారం తెల్లవారు జామున 3.30 గంటలకు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యువతీయువకులతో పాటు బర్త్‌డే చేసుకున్న మహ్మద్ లుక్మాన్, ఫామ్ హౌస్ యాజమాని అబ్దుల్ బీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మద్యం, గంజాయి స్వాధీనం

ముజ్రా పార్టీలో అశ్లీల నృత్యాలు చేయడానికి యువతీయువకులను మత్తెక్కించడానికి మద్యం, గంజాయిని తాగించారు. ఆ మత్తులో తూగుతూ.. ఊగుతూ డీజే హోరులో అశ్లీల నృత్యాలు చేస్తున్నారు. పోలీసులు ఒక్కసారిగా దాడులు నిర్వహించడంతో ఉలిక్కిపడ్డారు. వాళ్లు తెచ్చుకున్న మద్యం, గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 70 గ్రాముల గంజాయి, రూ.19వేల నగదు, 15 నిరోద్ ప్యాకెట్లు, ఆరు వాహనాలతో పాటు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దర్యాప్తులో భాగంగా సీఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ముజ్రా పార్టీ నిర్వహించిన తీరుపై పూర్తి వివరాలు సేకరించారు.

భూవివాదం.. ఇరువర్గాల ఘర్షణ

- ప్లాట్ల కబ్జాకు యత్నిస్తున్న వారిని అడ్డుకున్న కాలనీ వాసులు, యజమానులు

స్వల్పంగా ధ్వంసమైన బస్సు, పూర్తిగా దగ్ధమైన ద్విచక్ర వాహనం

తుర్కయాంజాల్, ఏప్రిల్ 9 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ సర్వే నంబర్ 240లో భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కమ్మగూడ సర్వే నంబర్ 240, 241, 242లోని సుమారు 10 ఎకరాల భూమి తమకు చెందినదని ఈ మేరకు కోర్టు అర్డర్ ఉందంటూ పలువురు వ్యక్తులు బుధవారం స్థలాన్ని కబ్జాలోకి తీసుకునేందుకు యత్నించారు. అందులో భాగంగా ప్లాట్ల కడీలు, ప్రీకాస్ట్ గోడలను కూల్చివేస్తున్న సమయంలో కాలనీలో నివాసం ఉంటున్న వారితో పాటు ప్లాట్ల యజమానులు వాటిని కూల్చవద్దంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులు ప్లాట్ల యజమానులు, కాలనీ వాసులపై దాడికి పాల్పడడంతో వారు తిరిగి రాళ్లతో దాడికి దిగి కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులను తరిమికొట్టారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న సందర్భంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు అంటించడంతో పూర్తిగా కాలిపోయింది. అనంతరం కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులు పలువురు మహిళలను ఘటనా స్థలానికి తీసుకు రాగా కాలనీవాసులు వారిని అడ్డుకొని వారు వచ్చిన బస్సును కొంతమేర ధ్వంసం చేశారు. వివాదం చోటు చేసుకున్న గంటన్నర తర్వాత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు.

ఎమ్మెల్యే సమక్షంలో కొనసాగిన వివాదం

కమ్మగూడ సర్వే నంబర్ 240, 241, 242 భూ వివాదం బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సాక్షిగా కొనసాగింది. బుధవారం ఉదయం ఘర్షణ చోటు చేసుకున్న అనంతరం కాలనీ వాసులు, ప్లాట్ల యజమానులు తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వినిపించడానికి వెళ్లారు. ఆ సమయంలో జీపీఏ హోల్డర్ రామకృష్ణ ఎమ్మెల్యే ఎదుటే ఉన్నాడు. దీంతో కాలనీ వాసులు, ప్లాట్ల యజమానులు ఆళ్ల రామకృష్ణ మధ్య వివాదం చోటు చేసుకున్నది. రామకృష్ణకు చెందిన పలువురు వ్యక్తులు ప్లాట్ల యజమానులను తోసివేయడంతో వివాదం జరిగింది. వివాదం అంతా ఎమ్మెల్యే సమక్షంలోనే జరగడం గమనార్హం. క్యాంపు కార్యాలయంలో ఉన్న తేనేటీగలను కొందరు వ్యక్తులు రాళ్లతో కొట్టడంతో అవి దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. ఎమ్మెల్యే సైతం అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఆస్తులు అమ్ముకొని ఇల్లు కట్టుకున్నా..

సొంత ఊరిలో భూములన్నీ అమ్ముకొని ప్లాటు కొనుక్కొని ఇల్లు నిర్మించుకున్నా. ఇప్పటి వరకు ఎలాంటి వివాదం లేదని తెలుసుకొని ప్లాటు కొనుకున్నా. ఒక్కసారిగా కొందరు వ్యక్తులు వచ్చి ఈ భూమి, ప్లాట్లు మావే అంటే భరించలేక పోతున్నాం. ఈ ప్లాటు ఇల్లు లేకపోతే నా కుటుంబం రోడ్డున పడుతుంది. కబ్జాదారులు రాత్రి సమయంలో ఇండ్ల ముందు తిరుగుతూ అందరినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పోలీసులు స్పందించి గుండాల నుంచి రక్షణ కల్పించాలి.

- పద్మ, కమ్మగూడ, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ఈషా దవాఖానలో తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ

వికారాబాద్, ఏప్రిల్ 9 : ప్రైవేటు దవాఖానల యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్యం శాఖ జిల్లా అధికారి వెంకటరమణ సూచించారు. బుధవారం వికారాబాద్‌లో పీసీపీఎన్‌డీటీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దవాఖానలు, స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్వహిస్తున్న మెడికేర్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు నోటీసులు అందజేశారు. తనిఖీల్లో భాగంగా ఈషా హాస్పిటల్, అనంత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ల్లో గర్భిణులకు స్కానింగ్ చేసే యంత్రాలు, రికార్డులను పరిశీలించారు. హాస్పిటల్ యాజమాన్యం, గైనకాలజిస్ట్‌లతో మాట్లాడుతూ.. బిడ్డ, తల్లి ఆరోగ్య పరిరక్షణ కోసం మాత్రమే స్కానింగ్ చేయాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తే పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం స్కానింగ్ సెంటర్లను మూసివేయడంతో పాటు వైద్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి పీఎన్‌డీటీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయిస్తామన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో బుధవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమం కింద 15 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందజేశారు.

అటవీ భూముల్లో అక్రమ సాగు చేయొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్

వికారాబాద్, ఏప్రిల్ 9 : అటవీ భూముల్లో అక్రమంగా సాగు చేయరాదని అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. బుధవారం వికారాబాద్ జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ధారూరు మండల పరిధిలోని సంగాయ్‌పల్లి తండా వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ భూముల హద్దులను నిర్ధారించేందుకు సహకరించాలన్నారు. కొత్తగా అడవీ భూముల్లో సాగు పనులు చేయరాదన్నారు. అటవీ శాఖ భూములను ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ధారూరు ఎఫ్ఆర్‌వో, ఎఫ్ఎస్‌వో తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

పెయింటింగ్ డబ్బాలను తీసుకెళ్తున్న విద్యార్థులు

పెద్దేముల్, ఏప్రిల్ 9 : పెద్దేముల్‌లోని బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ బాలరాజును వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హాస్టల్‌కు తీసుకొచ్చిన పెయింటింగ్ డబ్బాలను పిల్లలతో మోయిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులతో ఇలాంటి పనులు చేయిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.